నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్ - మేడ్చల్

1 హైదరాబాద్, మంగళవారం 16 జూలై 2024 HYDERABAD

## ఏ అభివృద్ధి కోసం.. పార్టీ మారారు

### ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌పై కార్తిక్‌రెడ్డి విమర్శలు

శంషాబాద్ రూరల్, జూలై 15 : తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి 4 నుంచి 5వేల కోట్ల రూపాయలతో అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని అనేకసార్లు సభలు, సమావేశాల్లో ప్రకటించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్..మరీ ఏ అభివృద్ధి కోసం పార్టీ మారారో ప్రజలకు చెప్పాల్సిన అవసరమున్నదని బీఆర్‌ఎస్ రాష్ట్ర నేత కార్తిక్‌రెడ్డి అన్నారు. సోమవారం శంషాబాద్ పట్టణంలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గానికి దాదాపు 5వేల కోట్ల రూపాయల నిధులు ఇచ్చిన బీఆర్‌ఎస్‌ను కాదని.. కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి చేస్తారో చెప్పాలన్నారు. నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను కబ్జా చేయడానికే పార్టీ మారినట్లు వినిపిస్తున్న వార్తలు నిజమేనా.. అని ప్రశ్నించారు. ఒకవేళ అదే జరిగితే.. ప్రభుత్వ భూములను పట్టా భూములుగా మార్చాలని చూస్తే ఊరుకునేదిలేదని హెచ్చరించారు. కేసీఆర్‌ను మోసం చేసి పార్టీ మారుతున్న నాయకులకు సరైన కాలంలో తగ్గిన శాస్తి జరుగుతుందన్నారు.

## నేడు బోరబండలో సమస్యలపై శంఖారావం

జూబ్లీహిల్స్, జూలై 15: బోరబండ సైట్-3 జయశంకర్ కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం సమస్యలపై శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీలోని అన్ని విభాగాలతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించి.. సమస్యలపై వినతి పత్రాలు స్వీకరించనున్నారు. ఆయా సమస్యలకు పరిష్కారం చూపేందుకు ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను అధికారులకు అక్కడే అందజేస్తారు. సమస్యలను పరిష్కరిస్తారు. ఈ మేరకు ఉదయం 10 గంటలకు నిర్వహించే సమస్యలపై శంఖారావం కార్యక్రమంలో బస్తీలు, కాలనీల్లో ఎదుర్కొంటున్న సమస్యలను వినతిపత్రం ద్వారా అధికారుల దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి ఒక ప్రకటనలో సూచించారు.







సెంట్రల్ లైబ్రరీ వద్ద నిరుద్యోగులపై పోలీసుల దౌర్జన్యం

# నినదించి.. గర్జించి

## నిరుద్యోగుల రణనినాదం.. సచివాలయం ముట్ట'డీ' ఉద్రిక్తం

### తెల్లవారుజాము నుంచే అరెస్టులు

### సెంట్రల్ లైబ్రరీకి తాళం వేసిన పోలీసులు

### ర్యాలీగా బయలుదేరిన వారిపై దౌర్జన్యం

సిటీబ్యూరో/ఉస్మానియా యూనివర్సిటీ/ఖైరతాబాద్/చిక్కడపల్లి, జూలై 15 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగులు చేస్తున్న ఆందోళనలతో నగరం అట్టుడుకుతున్నది. పోలీసులు నిరుద్యోగులను ఎక్కడికక్కడే నిర్బంధిస్తున్నారు. నిరసన తెలుపుతున్న వారిపై విచక్షణ రహితంగా లాఠీచార్జ్ చేస్తున్నారు. డీఎస్సీ వాయిదా, గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులను పెంచాలనే డిమాండ్లతో కొన్ని రోజులుగా నిరుద్యోగులు నిరసన తెలుపుతున్నా.. ప్రభుత్వం దిగిరావడం లేదు. దీంతో సోమవారం సచివాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. అయితే ఆందోళనలు భగ్నం చేసేందుకు పోలీసులు ఎక్కడికక్కడే నిరుద్యోగులను కట్టడి చేశారు. అశోక్‌నగర్, చిక్కడపల్లి, ఇందిరాపార్కు, ఉస్మానియా యూనివర్సిటీ, దిల్‌సుఖ్‌నగర్ పరిసర ప్రాంతాల్లో యువతను తెల్లవారుజాము నుంచే పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం రాత్రి చిక్కడపల్లిలోని సెంట్రల్ లైబ్రరీ వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొన్నది. నిరుద్యోగ యువతను పోలీసులు అరెస్టు చేశారు. అడ్డొచ్చిన వారిపై లాఠీలు ఝుళిపించారు.

- సమగ్ర కులగణన, 42 శాతం రిజర్వేషన్లు, రెండు లక్షల ఉద్యోగాలు నిరుద్యోగుల సమస్యలు తీర్చాలంటూ బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు మద్దతుగా చేపట్టిన సెక్రటేరియేట్ ముట్టడి విజయవంతమైందని ప్రకటించారు. పోలీసులు అష్టదిగ్బంధం చేసినా.. సచివాలయంలోకి నిరుద్యోగులు చొచ్చుకెళ్లడంతో పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు.
- ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థులపై పోలీసులు తెల్లవారుజాము నుంచి విరుచుకుపడ్డారు.విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేశారు. హాస్టళ్లు, ఇండ్లు అనే తేడా లేకుండా బలవంతంగా లోనికి ప్రవేశించి, వారిని అదుపులోకి తీసుకున్నారు. బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు, నాయకులు అనిల్, కొంపల్లి నరేశ్, మిథున్ ప్రసాద్ తదితరులను అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు.

### సెంట్రల్ లైబ్రరీ వద్ద..

చిక్కడపల్లిలోని సెంట్రల్ లైబ్రరీ వద్ద తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. నిరుద్యోగ యువకులు మరోసారి మెరుపు సమ్మెకు దిగారు. భారీ సంఖ్యలో హాజరైన యువకులు ర్యాలీగా బయలుదేరేందుకు ప్రయత్నిస్తుండడంతో పోలీసులు అడ్డుకున్నారు. లైబ్రరీ గేట్లు వేసి వారిని బయటకు రాకుండా అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులతో వాగ్వాదం చోటు చేసుకుంది. పలువురు యువకులు తమ నిరసన వ్యక్తం చేస్తామంటూ గేట్ల తాళాలు తొలగించుకొని బయటకు వచ్చారు. వారిని పోలీసులు అరెస్టు చేశారు.





సచివాలయం వద్ద విద్యార్థి నేతలను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

# ప్రజాపాలనలో ప్రజాస్వామ్యం పరిహాసం

### బోనాల చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్‌కు తిలోదకాలు

### అధికారుల తీరుపై ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి నిరసన

ఆర్కేపురం, బడంగ్‌పేట, జూలై 15: 'ప్రజలు తిరస్కరించిన వ్యక్తిని వేదికపై కూర్చోబెట్టి, ప్రజల ఆశీర్వాదంతో గెలిచిన ఎమ్మెల్యేను కింద కూర్చోబెట్టడమేనా.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రజా పాలన' అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు తీసుకున్న తర్వాత వ్యవస్థలన్నీ నాశనమవుతున్నాయని విమర్శించారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్‌లోని ఖిల్లా మైసమ్మ దేవాలయ ఆవరణలో సోమవారం ఆషాఢ మాస బోనాల దశాబ్ది ఉత్సవాల-2024 చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ఎమ్మెల్యే అయిన సబితా ఇంద్రారెడ్డిని ఆహ్వానించారు. ఇదే కార్యక్రమానికి ప్రభుత్వ సలహాదారులు వేణుగోపాల్‌రావు కూడా హాజరయ్యారు. అయితే అధికారిక కార్యక్రమాల్లో సంబంధం లేని వ్యక్తులను వేదికపైకి పిలువడంపై ఎమ్మెల్యే అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారిక కార్యక్రమాల్లో ఇతర వ్యక్తులు రావడానికి వీలు లేదన్నారు. ఏ హోదాలో కాంగ్రెస్ నాయకులను వేదిక మీదకు పిలుస్తున్నారని నిలదీశారు. అధికారిక కార్యక్రమాలకు పార్టీ నాయకులను పిలవడంపై ఆమె నిరసన తెలిపారు. దీంతో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. కాంగ్రెస్ నాయకుడు కేఎల్‌ఆర్‌తో పాటు మరికొంత మంది ఆ పార్టీ నేతలు వేదికపైకి రావడంతో ఎమ్మెల్యే కిందకు దిగిపోయారు. వేదిక కింద కూర్చొని నిరసన తెలిపారు. సలహాదారు వేణుగోపాలరావు ఎమ్మెల్యేకు నచ్చ చెప్పే ప్రయత్నం చేసినా.. ఆమె అంగీకరించలేదు. బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... ప్రొటోకాల్ పాటించకుండా, ప్రజలతో ఎన్నుకున్న ఎమ్మెల్యేలను అగౌరపరుస్తున్నారని, ప్రజాప్రతినిధులను గౌరవించే సంప్రదాయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నేర్చుకోవాలన్నారు. ఎమ్మెల్యేతో పాటు ఓడిపోయిన అభ్యర్థి కూడా స్టేజీ మీద ఉన్నారంటే, సీఎం రేవంత్ రెడ్డి కూడా కొడంగల్‌లో తనపై ఓడిపోయిన అభ్యర్థిని తీసుకొచ్చి ప్రభుత్వ కార్యక్రమాల్లో స్టేజీపై తన పక్కన కూర్చుబెట్టుకొనే విధంగా చట్టం తేవాలన్నారు. బోనాల పండుగ ఉత్సవాలకు నిధులివ్వాలనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందే కేసీఆర్ అని తెలిపారు. 60వేల ఓట్లతో తనపై ఓడిపోయిన వ్యక్తిని స్టేజీపైకి తీసుకొచ్చి ప్రొటోకాల్ పాటించకుండా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారన్నారు. ప్రభుత్వం తమదేనని ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తే... ప్రజాగ్రహానికి గురుకాక తప్పదని హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, ఇతర నేతలు

### పేదలకు తులం బంగారమిస్తే సంతోషించేవారం..

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నుంచి ఓడిపోయిన ఎమ్మెల్యే అభ్యర్థులతో తులం బంగారం ఇచ్చి పంపిస్తే స్వాగతించేవాళ్లమని సబితాఇంద్రారెడ్డి అన్నారు. గతంలో బోనాల ఉత్సవాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఇన్‌చార్జీల వ్యవస్థ లేదని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కార్యక్రమాల్లో ఇదేరీతిన ప్రొటోకాల్ సమస్య తలెత్తుతున్నదన్నారు. ఈ విషయంలో స్పీకర్ జోక్యం చేసుకొని ప్రొటోకాల్ సమస్యను పరిష్కరించాలని కోరారు. కాంగ్రెస్ పాలనలో వ్యవస్థలన్నీ అస్తవ్యస్తంగా మారాయని విమర్శించారు. ఒక పక్క ఆందోళన కొనసాగుతుండగానే వేణుగోపాల్‌రావు, మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, బడంగ్‌పేట మేయర్ పారిజాత, చల్లా నర్సింహారెడ్డి, పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, దేవాదాయ శాఖ అధికారులు కాంగ్రెస్ స్థానిక ప్రతినిధులతో కలిసి పలు ఆలయ కమిటీలకు చెక్కులను పంపిణీ చేసి వెళ్లిపోయారు. నిరసనలో నియోజకవర్గ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, డివిజన్ అధ్యక్షులు పెండ్యాల నగేశ్, లోకసాని కొండల్‌రెడ్డి, న్యాలకొండ శ్రీనివాస్‌రెడ్డి, కొండ్ర శ్రీనివాస్,శ్రీమన్నారాయణ, సాజీద్, పెంబర్తి శ్రీనివాస్, సిద్దగోని వెంకటేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'ఆ స్వచ్ఛ ఆటోలపై చర్యలు తీసుకోండి'

సిటీబ్యూరో: తరచూ విధులకు హాజరు కానీ స్వచ్ఛ ఆటోల వివరాలు సేకరించి, తగిన చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్లకు కమిషనర్ ఆమ్రపాలి ఆదేశాలు జారీ చేశారు. కమర్షియల్ ప్రాంతాల్లో స్వచ్ఛ ఆటోలు రాత్రి సమయాల్లోనే చెత్త సేకరించాలన్నారు. సోమవారం అడిషనల్, జోనల్ కమిషనర్లు, ఎంటమాలజీ చీఫ్‌లతో కమిషనర్ ఆమ్రపాలి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వచ్ఛ ఆటోల హాజరుపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అక్రమ భవన నిర్మాణాలపై ఫోకస్ పెట్టాలని జోనల్ కమిషనర్లను ఆదేశించారు. శేరిలింగంపల్లి జోన్‌ను పారిశుధ్య నిర్వహణలో రోల్ మోడల్ చేయాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద పెద్ద సంపుల నిర్మాణాలను చేపట్టేందుకు టెండర్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. డెంగీ వ్యాధి ప్రబలిన వ్యక్తుల సమాచారం రోజు వారీగా జోన్ల నుంచి మధ్యాహ్నం వరకు హెడ్ ఆఫీస్‌కు తప్పనిసరిగా పంపాలని కమిషనర్ ఆదేశించారు.

## వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించండి

### పౌరులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలి

### టెలీ కాన్ఫరెన్స్‌లో జీహెచ్ఎంసీ అధికారులకు దానకిశోర్ ఆదేశాలు

సిటీబ్యూరో, జూలై 15 (నమస్తే తెలంగాణ) : వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి అక్కడి పరిస్థితులను చక్కదిద్దాలని జీహెచ్ఎంసీ, డీఆర్‌ఎఫ్ బృందాలకు పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ ఆదేశాలు జారీ చేశారు. ఆదివారం రాత్రి కురిసిన వర్షం నేపథ్యంలో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్ జీహెచ్ఎంసీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ విజిలెన్స్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారులతో సోమవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులపై ఆరా తీశారు. వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించాలని సూచించారు. అక్కడి పరిస్థితులను చక్కదిద్దాలని ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూడాలని చెప్పారు. ఇందుకు ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకోవాలని, నగర పౌరులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

# తూతూ మంత్రంగా ప్రజావాణి

## బల్దియాలో కంటితుడుపు చర్యగా నిర్వహణ

### మేయర్, కమిషనర్ లేకుండానే ముగిస్తున్న కార్యక్రమం

### దూర ప్రాంతాల నుంచి వచ్చి.. నిరాశతో వెళ్తున్న ఫిర్యాదుదారులు

సిటీబ్యూరో: జీహెచ్ఎంసీలో ప్రజావాణి కంటితుడుపు చర్యగా మారింది. దూర ప్రాంతాలు నుంచి వచ్చి..ఎంతో ఆశగా అపరిష్కృత సమస్యను మేయర్, కమిషనర్‌కు విన్నవిస్తే పరిష్కారం దొరుకుతుందని భావిస్తున్న అర్జీదారులకు నిరాశే ఎదురవుతున్నది. గడిచిన నాలుగు వారాలుగా ప్రతి సోమవారం నిర్వహించే ఈ విశిష్ట కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆమ్రపాలి పాల్గొనడం లేదు. మేయర్, కమిషనర్ లేని ప్రజావాణిని ఉన్నతాధికారులు తూతూ మంత్రంగా ముగిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పైగా ప్రజావాణిలో ఒకసారి కాకుంటే మరోసారి వచ్చి ఫిర్యాదు చేసినా.. లాభం ఉండటం లేదని దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, 6 నెలల నుంచి జీతాలు లేక బతకడమే కష్టంగా మారిందని ఈఎస్‌ఐ ఆసుపత్రి స్వీపర్స్, సెక్యూరిటీ సిబ్బంది అధికారుల వద్ద గోడు వెల్లబోసుకున్నారు. తమను నియమించిన ఏజెన్సీలు తమకు జీతాలు ఇవ్వకుండా వెట్టిచాకిరీ చేయించుకుంటున్నాయని కన్నీటి పర్యంతమయ్యారు. ఇప్పటికీ నాలుగు సార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ లేబర్ ఆఫీసర్‌ను కలవాలని చెబుతున్నారని.. అక్కడికి వెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులు సాజీదా బేగం, సుజాత, రజినీ, యాదమ్మ మాట్లాడుతూ.. 'మాకు జనవరి నుంచి ఇప్పటి వరకు జీతం ఇవ్వలేదు. ఆ డబ్బులొస్తేనే మా పిల్లలకు స్కూలు, కాలేజీల ఫీజులు చెల్లించగలం. ఇంటి కిరాయి కట్టుకోగలం. కడుపునిండా అన్నం తినగలం. ఆ జీతం రాక రోజు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. అని వాపోయారు.



సోమవారం బల్దియాలో ప్రజావాణిలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

### స్పందన నామమాత్రమే

ప్రధాన కార్యాలయంలో 64 విన్నపాలను అధికారులు స్వీకరించారు. టెలిఫోన్ ద్వారా మరో 8 ఫిర్యాదులను స్వీకరించారు. దరఖాస్తుల్లో 25 టౌన్‌ప్లానింగ్, 10 రెవెన్యూ, ఏడు డీఎంఅండ్‌హెచ్‌వో, ఇంజినీరింగ్ మెయింటనెన్స్ ఐదు, అడ్మిన్ సెక్షన్‌కు సంబంధించినవి నాలుగు, జలమండలివి రెండు విన్నపాలను స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. బస్తీ దవాఖాన, ఫుట్‌పాత్ ఆక్రమణ, ఇంటి ముందు విగ్రహం ఏర్పాటు, వీధి కుక్కల సమస్యలపై విన్నవించినట్లు అడిషనల్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. ఇక జోన్లలో 102 ఫిర్యాదులు స్వీకరించగా, కూకట్‌పల్లి జోన్‌లో అత్యధికంగా 73 దరఖాస్తులను స్వీకరించారు. శేరిలింగంపల్లిలో 15, చార్మినార్‌లో 5, ఎల్బీనగర్ 3, ఖైరతాబాద్ జోన్‌లో ఒకటి మాత్రమే విన్నపాలు వచ్చాయి.

### చర్చనీయాంశంగా మేయర్ తీరు

నగరాభివృద్ధిలో ముఖ్య భూమిక పోషించడమే కాదు.. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాల్సిన బాధ్యత మేయర్‌ది. అయితే అటు తోటి కార్పొరేటర్లకు కానీ, ఇటు ప్రజలకు మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దూరంగా ఉంటూ వస్తున్నరన్న విమర్శలున్నాయి. పైగా బల్దియా ప్రధాన కార్యాలయానికి మొక్కుబడిగా వస్తున్నారు. సీఎస్‌ఆర్ నిధుల సమీకరణ, సిస్టర్ సిటీ ఒప్పందాలపై సమీక్షలు ఆశించిన స్థాయిలో ఉండటం లేదు. అన్నింటి కంటే ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే ఘటనాస్థలికి వెళ్లడం లేదు. శానిటేషన్‌పై ఆకస్మిక పర్యటనలు లేవు.. అప్పుల కుప్పలో కూరుకుపోయిన జీహెచ్ఎంసీని గట్టెక్కించే ప్రయత్నాలు కానీ...నగరాభివృద్ధికి మేయర్ చేసిందేమీలేదన్న విమర్శలు లేకపోలేదు. మేయర్‌గా బాధ్యతలు చేపట్టి..మూడేండ్లు గడిచినా.. పాలనలో తన మార్కును చూపలేకపోతున్నారు. కార్పొరేషన్‌పై పట్టు సాధించలేకపోతున్నారనే విమర్శలను ఎదుర్కొంటున్నారు. నగరంలో పర్యటించి ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్న దాఖలా ఒక్కటీ లేదని ప్రతిపక్ష పార్టీలైనా బీఆర్‌ఎస్, బీజేపీ, ఎంఐఎం కార్పొరేటర్లు విమర్శిస్తున్నారు. కేవలం అధికారులపై ఆధారపడటం వల్లే.. ప్రజా సమస్యలకు పరిష్కారం చూపలేకపోతున్నారని అంటున్నారు. మేయర్ మాట్లాడే విధానంలోనూ విమర్శలు లేకపోలేదు.



కోకాపేటలో ఏర్పాటు చేసిన అత్యాధునిక డ్రాపిట్ ప్రీమియం లాండ్రీ సర్వీస్‌ను ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# హామీలు నిలబెట్టుకోవాలి

### బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

సిటీబ్యూరో, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఒకే ఏడాదిలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి యువతకు హామీ ఇచ్చారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు కావస్తున్నా.. ఆ దిశగా నోటిఫికేషన్లు వేయలేదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. సోమవారం నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం కేటీఆర్ పీటీఐతో నిరుద్యోగుల అంశంపై ప్రత్యేకంగా మాట్లాడారు. తెలంగాణలో నిరుద్యోగులు పెద్ద ఎత్తున నిరసనలు, ఆందోళనలు చేస్తున్నారని, అర్ధరాత్రి వేళల్లో సైతం రహదారులపైకి వచ్చి.. ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేస్తున్నా..సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం స్పందించడం లేదన్నారు. 'ఢిల్లీలో ఉన్న రాహుల్ గాంధీ తెలంగాణ నిరుద్యోగుల ఆందోళనలపై స్పందించాలి. వారికి కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి' అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

### యువత వ్యాపారవేత్తలుగా మారేందుకు ప్రయత్నించాలి

యువత చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగాల కోసమే ఎదురు చూడకుండా, వ్యాపారవేత్తలుగా మారేందుకు ప్రయత్నించాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కోకాపేటలో ఇద్దరు యువకులు ఏర్పాటు చేసిన డ్రాపిట్ ప్రీమియం లాండ్రీ సర్వీస్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ యువతరాన్ని వ్యాపార రంగంలో ప్రోత్సహించేందుకు గత కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో పథకాలను ప్రారంభించిందన్నారు. ప్రస్తుతం కోకాపేటలో ప్రారంభించిన డ్రాపిట్ ప్రీమియం లాండ్రీ సర్వీస్‌ను నగరంలో 15 చోట్ల ఏర్పాటు చేసే ప్రణాళికలో ఉన్నారని అన్నారు.వీటి ద్వారా కొత్త తరహాలో సేవలు అందించడంతో పాటు ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నారన్నారు.